క్లుప్తంగా

కోయి శేషమ్మకు నివాళి



కోయి శేషమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నేతలు, పార్టీ శ్రేణులు

మేదరమెట్ల: కొరిశపాడు మండలం మేదరమెట్ల గ్రామనాయకుడు మాజీ ఏఎంసీ వైస్ చైర్మన్ కోయి అంకారావు తల్లి కోయి శేషమ్మ దశదిన కర్మ బుధవారం జరిగింది. అద్దంకి నియోజకవర్గం వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పానెం చిన హనిమిరెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ వైవీభద్రారెడ్డి, నియోజకవర్గం పరిశీలికుడు మారం వెంకారెడ్డి పాల్గొని శేషమ్మ చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

ఉపాధి కూలీలందరికీ పనులు

చీరాల టౌన్: మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో ఉన్న ఉపాధి కూలీలందరికీ పనులు కల్పించాలని ఎంపీడీఓ శోభారాణి ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బందిని ఆదేశించారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బందితో సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ చీరాల మండలంలోని 15 పంచాయతీల్లో 11 గ్రామ పంచాయతీల్లో ఉన్న ఉపాధి కూలీలందరికీ ఉపాధి పనులు కల్పించాలని సూచించారు. ఉపాధి పనులను ఉదయం 6.30 నుంచి 10 గంటల వరకు కల్పించడంతో పాటు పని ప్రదేశంలో మంచినీటి, ప్రాథమిక చికిత్స కిట్లు అందుబాటులో ఉంచాలన్నారు. ఉపాధి కూలీలు అందరి వివరాలను జాబ్ కార్డులతో పాటు మస్టర్లలో నమోదు చేయాలన్నారు. ఉపాధి కూలీలకు కూలీ డబ్బులను వారి బ్యాంకు ఖాతాల్లోనే జమ చేయాలని సూచించారు. ఎన్ఆర్ఈజీఎస్ అధికారులు, సిబ్బంది విధులను విస్మరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో దాసు, ఎఫ్ఏలు, సిబ్బంది ఉన్నారు.

టమాటో మినీ లారీ బోల్తా



రోడ్డు పక్కన బోల్తా కొట్టిన మినీ లారీ

వేటపాలెం: జాతీయ రహదారి– 216లో పందిళ్లపల్లి వద్ద బైపాస్ రోడ్డులో టమాటో లోడుతో వెళుతున్న మినీ లారీ బుధవారం అదుపు తప్పి బోల్తా కొట్టింది. ఒంగోలు వైపు నుంచి చీరాల వైపు టమాటో లోడుతో వెళుతున్న లారీ పందిళ్లపల్లి సమీపానికి రాగానే అధిక వేగంతో అదుపు తప్పి రోడ్డు పక్కకు దూసుకుపోయి పల్టీ కొట్టింది. లారీలో టమోటాలు పూర్తిగా నేలపాలయ్యాయి. లారీ డ్రైవర్‌కు కొద్ది పాటి గాయాలయ్యాయి. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

శింగరకొండ దర్శిని



ప్రసన్నాంజనేయ స్వామి మూల విరాట్టు

అద్దంకి: క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం వైశాఖ మాసం ధనిష్ట నక్షత్రం సప్తమి తిథి సందర్భంగా గురువారం ప్రత్యేక పూజలు చేస్తారని దేవస్థాన ఏసీ సుభద్ర బుధవారం తెలిపారు. ఉదయం బిందె తీర్థం, మధ్యాహ్నం 1.00 గంట నుంచి 1.30 గంట వరకు పంచ హారతుల పూజ నిర్వహిస్తారు. రాత్రి 7 గంటల నుంచి 7.45 గంటల వరకు జరిగే ప్రదోషకాలార్చన అనంతరం ఆలయం మూసివేస్తారు.

వైద్యుల సూచనలతో సంపూర్ణ ఆరోగ్యం

చీరాల టౌన్: గర్భిణులు వైద్య పరీక్షలు చేయించుకుని వైద్యుల సూచనల, సలహాలు పాటిస్తే ప్రసవాలు సాధారణంగా జరగడంతో పాటు తల్లీబిడ్డ ఆరోగ్యంగా జీవిస్తారని ఈపూరుపాలెం పీహెచ్‌సీ వైద్యులు శ్రీదేవి సూచించారు. బుధవారం మండలంలోని ఈపూరుపాలెం ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో ప్రధాన మంత్రి మాతృత్వ సురక్షా యోజన పథకంలో గ్రామంలోని గర్భిణులకు పీహెచ్‌సీలో వైద్య పరీక్షలను చేశారు. ఈసందర్భంగా వైద్యులు శ్రీదేవి మాట్లాడారు. గర్భిణులు 20 రోజులకు ఒకసారి విధిగా వైద్యుల వద్ద సేవలు పొందాలన్నారు. తల్లీబిడ్డ ఆరోగ్యంగా ఉండాలంటే పోషక విలువలు కలిగిన ఆహారాన్ని తీసుకోవడంతో పాటు పాలు, గుడ్లు, ఆకుకూరలు, బెల్లం విధిగా రోజువారీ ఆహారంలో ఉండాలన్నారు. ప్రసవాలు జరిగేంత వరకు గర్భిణులు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ వైద్యశాలల్లోనే కాన్పులు జరిగేలా చూసుకోవాలని, ప్రసవాల కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా పథకాలు రూపొందించిందని వీటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. రక్తహీనత లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సూపర్‌వైజర్లు, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు ఉన్నారు.

అంతా ఎండల్



- 40–42 డిగ్రీల ఉష్ణోగ్రతలతో సూర్య ప్రతాపం
- తీవ్ర ఇబ్బందులు పడుతున్న వృద్ధులు, చిన్నారులు
- జాగ్రత్తలు లేకుంటే ప్రమాదాలు తప్పవంటున్న వైద్యులు
- మరో నాలుగు రోజులు ఇలానే ఉంటుందని వాతావరణ శాఖ హెచ్చరిక

కారంచేడు:

వేసవి ఉష్ణోగ్రతలు రోజు రోజుకూ పెరిగిపోతుండటంతో జనం బెంబేలెత్తి పోతున్నారు. సముద్ర తీర ప్రాంతాలైన చీరాల, బాపట్ల నియోజకవర్గాల్లో ఎండతో పాటు ఉక్కపోతతో ప్రమాద ఘంటికలు మోగుతున్నాయి. వడదెబ్బతో పాటు వజీర్ణకోశ వ్యాధులు, అధిక వాంతులు, అధిక విరేచనాలు, డీహైడ్రేషన్, చర్మ వ్యాధులు, జ్వరాలు పొంచి ఉంటాయి. బుధవారం నియోజకవర్గంలో 42 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో ప్రతి ఒక్కరూ జాగురూకతతో ఉండక తప్పదు. వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పర్చూరు సీహెచ్‌సీ సివిల్ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ సౌమ్య పలు విషయాలు వివరించారు.



ఎండల తీవ్రతకు రోడ్డు నిర్మానుష్యంగా ఉన్న కారంచేడు

వడదెబ్బకు గురైతే లక్షణాలు

వడదెబ్బకు గురైన వారికి తీవ్రమైన తలనొప్పి, జ్వరం, కండరాల నొప్పులు వస్తాయి. కొన్ని సందర్భాల్లో వ్యక్తులు అపస్మారక స్థితికి చేరుకుంటారు. వాంతులు, విరేచనాలు అవ్వడం వలన నీరసంతో సొమ్మసిల్లి పోతారు. వడదెబ్బ తగిలిన వారిని మంచి గాలి, వెలుతురు, నీడ ఉండే ప్రాంతాల్లో ఉంచాలి. చల్లటి తడి బట్టలతో తుడుస్తూ ఉండాలి. ఓఆర్ఎస్ ప్యాకెట్‌లను తాగించాలి. ఉప్పు కలిపిన మజ్జిగ లేదా చిటికెడు ఉప్పు కలిపిన గ్లూకోజ్ ద్రావణం పట్టించాలి. వడదెబ్బతో అపస్మారకంగా ఉన్న దశలో నీరు తాగించకూడదు. వీలైనంత త్వరగా సమీపంలోని ఆసుపత్రికి తరలించాలి. గ్రామాల్లో ఇప్పటికే ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తల వద్ద ఈ ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచారు.



జాగ్రత్తలు అవసరం: వేసవి కాలంలో ఉష్ణోగ్రతలు ఎంత ఎక్కువగా ఉన్నప్పటికీ తగిన జాగ్రత్తలు తప్పకుండా పాటించాలి. నిర్లక్ష్యంగా ఉంటే చాలా ఇబ్బందులు వస్తాయి. ఎండల తీవ్రతను బట్టి చర్మ వ్యాధులు వ్యాపిస్తాయి. చికెన్‌ఫాక్స్ విషయంలో మూఢ నమ్మకాలను వదలి మందులు వాడితే మంచిది. సీజనల్‌గా మార్కెట్‌కు వచ్చే పండ్లు తీసుకోవాలి. తేలికపాటి ఆహారంతో పాటు, ఆకు కూరలు ఎక్కువగా వాడాలి.

డాక్టర్ జి. సౌమ్య, వైద్యాధికారి, సీహెచ్‌సీ, పర్చూరు

జాగ్రత్తలు ఇవే..

- అత్యవసరమైతే తప్ప బైటకు రాకూడదు.
- అలాసంటి సమయంలో తలకు టోపీ, గొడుగు, కళ్ళకు నల్ల కళ్ళ అద్దాలు వాడాలి.
- మధ్యాహ్నం 12 గంటల్లోపు ఇంటికి చేరుకోవాలి.
- కాటన్, మెత్తని దుస్తులు ధరించాలి
- పొలం పనులకు వెళ్ళే వారు మంచినీరు, మజ్జిగ, ఓఆర్ఎస్ నీరు, నిమ్మరసం వంటివి తీసుకెళ్లాలి.
- రోజుకు మూడు నుంచి నాలుగు లీటర్ల నీరు (15 గ్లాసులు) తాగాలి.
- తేలికైన ఆహారం, కూరగాయలు, తాజా పండ్లు ఎక్కువగా తీసుకోవాలి.
- ఆహార విషయంలో సమయపాలన ఉండాలి. తగిన సమయానికి ఆహారం తీసుకోవాలి. లేకుంటే అరుగుదల లోపంతో చాలా సమస్యలు ఉత్పన్నమవుతాయి.
- గర్భిణులు, వృద్ధులు, చిన్నారులు, దీర్ఘకాలిక వ్యాధులున్నవారు, గుండె వ్యాధులున్న వారు అవసరమైతే తప్ప బయట తిరగవద్దు.
- బైట నుంచి ఇంటికి వచ్చిన వెంటనే ఫ్రిజ్‌లోని చల్లని నీరు తాగకూడదు.
- మద్యపానం, ధూమపానం, మత్తు పదార్థాలను తీసుకోకూడదు.
- సీతల పానీయాలు అసలు తీసుకోవద్దు. పొలం పనులకు వెళ్ళి వచ్చే వారు కూడా ఈ కూల్ డ్రింక్స్‌ను తీసుకోకూడదు.
- రోడ్లపై అమ్మే రంగుల పానీయాలు వాడవద్దు.
- మాంసాహారం, చిరుతిళ్ళు వాడకూడదు.
- మార్కెట్‌లోని కలుషిత ఆహారం అసలు తీసుకోవద్దు.

శరీరంలో ఎక్కువ వేడి ఉత్పత్తి కావడం, శరీరం ఉష్ణాన్ని కోల్పోవడం వల్ల వడదెబ్బ తగులుతుంది.

- 65 సంవత్సరాలు పైబడినవారు, గర్భిణులు, దీర్ఘకాల వ్యాధిగ్రస్తులు అప్రమత్తంగా ఉండాలి.

వంటల్లో శుభ్రత పాటించాలి

చీరాల అర్బన్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు రుచికరమైన భోజనంతోనే విద్యార్థులు ఆరోగ్యంగా ఉంటారని, ఆ బాధ్యత మీ చేతుల్లోనే ఉందని ఎంఈఓ–1 పి.సుబ్రహ్మణ్యేశ్వరరావు అన్నారు. 2024–25 విద్యా సంవత్సరానికి మండల స్థాయి మధ్యాహ్న భోజన నిర్వాహకులు, సహాయకులకు ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని బుధవారం స్థానిక ఎస్ఆర్‌పీఎం హైస్కూల్‌లో నిర్వహించారు. రిసోర్స్ పర్సన్ కె.ధనలక్ష్మి, సీఆర్‌పీ నాగరాజులు పవర్‌పాయింట్ ద్వారా వివరించారు. ఎంఈఓ మాట్లాడుతూ వంటగది శుభ్రత, వంట చేసేవారు శుభ్రత పాటించాలన్నారు. హైప్రోటీన్ మినరల్స్, కార్బొహైడ్రేట్స్ కలిగిన పదార్థాలను వంటలో వాడాలన్నారు. ప్రకృతి ఉపద్రవాలు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. వంటగదిలో అగ్నిప్రమాదం సంభవించినప్పుడు చేయాల్సిన ముందు జాగ్రత్తల చర్యలపై మాట్లాడారు. పాఠశాల విద్యార్థుల ఆరోగ్యం మీ చేతుల్లోనే ఉందని, ప్రభుత్వం అందిస్తున్న మెనూ ప్రకారం



మాట్లాడుతున్న ఎంఈఓ పి.సుబ్రహ్మణ్యేశ్వరరావు

శుచిగా, రుచిగా వండాలన్నారు. ఎంఈఓ–2 పి.సుధారాణి మాట్లాడుతూ పరిశుభ్రమైన వాతావరణంలో స్కూల్ ప్రాంగణంలో వంట నిర్వహించాలన్నారు. వంట చేసే ముందు ప్రతి ఒక్కరూ శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. పాఠశాల పునఃప్రారంభం తర్వాత విస్తృత స్థాయిలో పాఠశాలలను తనిఖీ ఉంటుందని చెప్పారు. అనంతరం మధ్యాహ్న భోజన కార్మికులకు వంటల పోటీలను నిర్వహించారు. సీఆర్‌పీలు జి.రత్నకుమారి, ఎ.నాగరాజు, టీవీ రమణ, జి.వెంకటేశ్వర్లు, కె.రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చూడాలి

యద్దనపూడి: ప్రస్తుతం వేసవి తీవ్రత దృష్ట్యా గ్రామాల్లో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చూడటంతో పాటు స్వచ్ఛమైన నీటిని సరఫరా చేయాలని ఎంపీపీ పులగం రజని అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ శివసుబ్రహ్మణ్యం అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. పంచాయతీ రాజ్, నీటి పారుదల, విద్యుత్, వ్యవసాయ, వైద్య, ఉపాధి, గృహనిర్మాణ తదితర శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎంపీపీ రజనీ మాట్లాడుతూ త్వరలో ఖరీఫ్ సీజన్ ప్రారంభం కానున్న దృష్ట్యా రైతులకు అవసరమైన పచ్చిరొట్ట ఎరువులు అందేలా వ్యవసాయశాఖ చర్యలు చేపట్టాలన్నారు. గ్రామాల్లో వలసలను నివారించేందుకు ప్రవేశపెట్టిన ఉపాధి హామీ పథకాన్ని పకడ్బందీగా అమలు చేయాలన్నారు. అలాగే మండలంలో చేపట్టిన నాడు–నేడు పనులను వెంటనే పూర్తి



మాట్లాడుతున్న ఏపీఓ రమేష్ బాబు

చేయాలని విద్యాశాఖాధికారులను ఆదేశించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి మండలాభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. మెత్తం మీద సమావేశం ఎన్నికల నియమావళి అమల్లో ఉన్నందున్న ఎటువంటి అంశాలపై తీర్మానాలు చేయకుండా ఎన్నికల కోడ్‌కు లోబడి సమావేశాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆయా శాఖల అధికారులు, సర్పంచ్‌లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోండి

అద్దంకి: ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ జ్యోతి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం మండల ప్రజా పరిషత్ సర్వ సభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశం ఎంపీపీ జ్యోతి అధ్యక్షతన నిర్వహించారు. సమావేశాన్ని ఎంపీడీఓ జి. సత్యనారాయణ నిర్వహించారు. సమావేశంలో మండల స్థాయి అధికారులు తమ శాఖల పరిధిలో అమలు జరుగుతున్న ప్రభుత్వ పథకాలు గురించి వివరించారు. పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. తమ శాఖల ప్రగతి నివేదికను తెలియజేశారు.



మాట్లాడుతున్న ఎంపీపీ జ్యోతి

వివిధ శాఖల మండల స్థాయి అధికారులు, ఎంపీటీసీలు, ప్రజా ప్రతినిధులు, పంచాయతీ సెక్రటరీలు పాల్గొన్నారు.

గ్రంథాలయాలతో విజ్ఞానం

అద్దంకి: గ్రంథాలయాలు విజ్ఞానాన్ని అందిస్తాయని గ్రంథపాలకుడు సుగుణరావు అన్నారు. వేసవి విజ్ఞాన శిబిరాల్లో భాగంగా స్థానిక గ్రంథాలయంలో బుధవారం వివిధ రకాల పోటీలను నిర్వహించి బహుమతులను అందజేశారు. ఆయన మాట్లాడుతూ వేసవి విజ్ఞాన శిబిరాలను సద్వినియోగం చేసుకుంటున్న విద్యార్థుల చేతిలో ఏదో ఒక అదనపు అర్హత ఉంటుందని చెప్పారు.

సంతమాగులూరు (అద్దంకి): వేసవి విజ్ఞాన శిబిరాల్లో భాగంగా సంతమాగులూరు శాఖ గ్రంథాలయంలో బుధవారం విద్యార్థులకు వివిధ రకాల పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులను అందజేశారు.



సంతమాగులూరులో మాట్లాడుతున్న గ్రంథపాలకుడు

గ్రంథపాలకుడు విజయభాస్కరరెడ్డి మాట్లాడుతూ స్పోకెన్ ఇంగ్లిష్ నేర్పిస్తున్నట్లు చెప్పారు.

ఎండల్లో అప్రమత్తంగా ఉండాలి

బల్లికురవ: రోహిణి కార్తె ఎండలతో పాటు వడగాడ్పులల ఉధృతి రోజురోజుకూ పెరుగుతోందని వృద్ధులు, చిన్నారుల ఆరోగ్యం పట్ల తగు జాగ్రత్తలు వహించాలని గుంటుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారులు మమత, భారతి కోరారు. 104 క్యాంపులో భాగంగా బుధవారం కొమ్మినేని వారిపాలెం, కూకట్లపల్లి గ్రామాల్లో షుగరు, బీపీ, హిమోగ్లోబిన్ పరీక్షలతో ఉచితంగా మందులు పంపిణీ చేశారు. సాయంత్రం శిబిరానికి రాలేని వృద్ధులు, చిన్నారులను ఇంటింటికి వెళ్లి పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు.



కేవీ పాలెంలో మాట్లాడుతున్న వైద్యాధికారి

వాటర్ ప్లాంట్ వితరణ



మార్టూరు ఆశ్రమంలో ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న మోహనరావు, అనూరాధ దంపతులు

మార్టూరు: స్థానిక అమ్మ అనాథాశ్రమ నిర్వహణ కోసం బుధవారం దాతలు 70 వేల రూపాయల విలువైన వాటర్ ప్లాంటును బహూకరించారు. మార్టూరుకు చెందిన ఎఫర్ట్ స్వచ్ఛంద సేవా సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ జేవీ మోహనరావు తన భార్య.. శ్రీకారం స్వచ్ఛంద సేవా సంస్థ కార్యదర్శి జాష్టి అనూరాధల వివాహ వార్షికోత్సవ సందర్భంగా వృద్ధులు, అనాథల సౌకర్యం కోసం వాటర్ ప్లాంటును ఆశ్రమ నిర్వాహకులు గుంటుపల్లి చందుకు అప్పగించారు. అనంతరం వృద్ధులకు పండ్లు, స్వీట్లు పంచి అన్నదానం నిర్వహించారు. వాటర్ ప్లాంటు బహూకరించిన మోహనరావు దంపతులను అభినందించారు. ప్రముఖ సినీ, టీవీ ఆర్టిస్ట్ వెంకట్ చౌదరి, మార్టూరు రోటరీ క్లబ్, ఇన్నర్ వీల్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

ద్విచక్రవాహనాల వేలం పాట రేపు

పర్చూరు (బుధవారం): పర్చూరులోని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో స్టేషన్లో శుక్రవారం వాహనాల వేలంపాట నిర్వహించనున్నట్లు సెబ్ సీఐ ఎం. భుజంగరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో, నెల్లూరు వారి ఆదేశాల మేరకు బాపట్ల సెబ్ సూపరింటిండెంట్ ఆధ్వర్యంలో వేలంపాట జరుగుతుందని ఆయన తన ప్రకటనలో పేర్కొన్నారు. గతంలో మద్యాన్ని తరలిస్తూ సీజ్ చేసిన వాహనాలను వేలం వేయనున్నట్లు తెలిపారు.

ఓట్ల లెక్కింపులో అభ్యర్థులు సహకరించాలి

పర్చూరు (బుధవారం): బాపట్లలో జూన్ నాలుగో తేదీన జరిగే ఓట్ల లెక్కింపులో అభ్యర్థులు సహకరించాలని పర్చూరు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి జి. రవీందర్ తెలిపారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వివిధ పార్టీల అభ్యర్థులు, ఏజెంట్లతో కౌంటింగ్ ప్రక్రియ గురించి ఆయన సమావేశమయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి అభ్యర్థి కౌంటింగ్ ఏజెంట్లను ఏర్పాటు చేసుకోవచ్చని తెలిపారు. జూన్ 3వ తేదీ సాయంత్రంలోగా ప్రతి అభ్యర్థి తమ ఏజెంట్లను నియమించుకోవాలని కోరారు. వారికి కేటాయించిన టేబుల్ వద్ద మాత్రమే కూర్చోవాలని తెలిపారు. ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం అంతా వ్యవహరించాలని కోరారు. సమావేశంలో పర్చూరు ఏఆర్వో సుబ్బయ్య, యద్దనపూడి ఏఆర్వో నాగరాజు, మార్టూరు ఏఆర్వో సంధ్యశ్రీ, కారంచేడు ఏఆర్వో మెహర్ బాబు, ఇంకొల్లు ఏఆర్వో ప్రమీల, చిన్నగంజాం ఏఆర్వో ఫణింద్ర బాబు, అభ్యర్థులు, వివిధ పార్టీల ప్రతినిధులు, ఏజెంట్లు పాల్గొన్నారు.

నేటి నుంచి హనుమజ్జయంతి వేడుకలు

అద్దంకి రూరల్: ప్రముఖ పుణ్యక్షేత్రమైన శింగరకొండ ప్రసన్నాంజనేయ దేవస్థానంలో గురువారం నుంచి శనివారం వరకు హనుమజ్జయంతి వేడుకలు నిర్వహించనున్నట్లు దేవస్థాన కార్యనిర్వాహణాధికారి తల్లాప్రగడ సుభద్ర బుధవారం తెలిపారు. గురువారం ఆలయ ప్రదక్షిణ, ఆలయ పరివార దేవతలైన శ్రీగణపతి, సుబ్రమణ్యేశ్వరస్వామి, జీవధ్వజ, ఉష్ణవాహన దేవతలకు నారీకేళ ఫల సమర్పణ, 9 గంటలకు గణపతి పూజ, నవగ్రమసహిత మన్యుసూక్త హోమం, స్వామివారి సహస్రనామ పూజ, సాయంత్రం అరటి పండ్లతో పూజ నిర్వహిస్తారు. 31 శుక్రవారం పూజా కార్యక్రమాలతో పాటు సుందరాకాండ పారాయణం, 1వ తేదీ శనివారం హనుమజ్జయంతి సందర్భంగా లక్ష తమల పాకులతో పూజలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

గ్రానైట్ కార్మికుడికి తీవ్రగాయాలు

మార్టూరు: జాతీయ రహదారిపై గ్రానైట్ కార్మికుడిని గుర్తు తెలియని వాహనం ఢీకొట్టిన సంఘటన బుధవారం రాజుపాలెం కూడలి వద్ద జరిగింది. ఏఎస్ఐ సైదా తెలిపిన వివరాలు.. ఒడిశ్శా రాష్ట్రానికి చెందిన రాజు సింగ్ అలియాస్ అఖిమ్ స్థానికంగా ఒక గ్రానైట్ ఫ్యాక్టరీలో కార్మికునిగా పని చేస్తున్నాడు. అనారోగ్య కారణంతో బుధవారంశెలవు పెట్టిన రాజు సింగ్ మందుల కోసం రాజుపాలెం జంక్షన్ వద్ద రహదారిపైకి వచ్చాడు. ఈ క్రమంలో గుంటూరు నుంచి ఒంగోలు వైపు వెళుతున్న ఇన్నోవా కారు రోడ్డు దాటుతున్న రాజు సింగ్‌ను బలంగా ఢీ కొట్టి ఆగకుండా వెళ్ళిపోయింది. ఎడమ కాలు విరిగి తలకు తీవ్ర గాయమైంది. కొన ఊపిరితో అపస్మారక స్థితిలో ఉన్న రాజుసింగ్ ను 108 సిబ్బంది స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రథమ చికిత్స అనంతరం గుంటూరు తరలించారు.

దశదిన కర్మకు హాజరైన హనిమి రెడ్డి



కోటేశ్వరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న హనిమి రెడ్డి

జె.పంగులూరు: మండల పరిధిలోని పంగులూరు గ్రామానికి చెందిన తన్నీరు కోటేశ్వరావు దశదిన కర్మకు బుధవారం అద్దంకి నియోజక వర్గ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పానెం చిన హనిమిరెడ్డి హాజరయ్యారు. ముందుగా కోటేశ్వరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులతో మాట్లాడారు. ఈ సందర్భంగా హనిమిరెడ్డి మాట్లాడుతూ కోటేశ్వరావు మృతి పార్టీకి తీరని లోటన్నారు. ఆయన కుటుంబ సభ్యులకు పార్టీ ఎప్పుడు అండగా ఉంటుందన్నారు. ఆయనతో పాటు నియోజక వర్గ పార్టీ పరిశీలకులు మారం వెంకారెడ్డి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర నాయకులు బీవీ కృష్ణరెడ్డి, మండల కన్వీనర్ స్వయంపు హనుమంతురావు, గ్రామ నాయకులు రావూరి శ్రీను, రాయిణి వెంకటసుబ్బారావు, శ్రీను, తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతలు గుర్తెరిగి పనిచేయండి

బల్లికురవ: ప్రభుత్వం మాతా శిశు సంరక్షణే ధ్యేయంగా ఏర్పాటు చేసి అంగన్‌వాడీ కేంద్రాల పర్యవేక్షణ కొరవడి విధులకు డుమ్మా కొడుతున్నారని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు బత్తుల పద్మావతి ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం బల్లికురవ మండలంలోని కొప్పరపాడు, ఎస్ఎల్ గుడిపాడు, సంతమాగులూరు మండలంలోని పాతమాగులూరు, గ్రామాల్లోని కేంద్రాలను తనిఖీ చేశారు. ఉదయం 10 గంటలైనా కేంద్రాలు తెరుచుకోకపోవటం.. ఇద్దరు, ముగ్గురు మాత్రమే పిల్లలు ఉండటం, కేంద్రాల్లో రికార్డులు అందుబాటులో లేకపోవటంతో అసహనం వ్యక్తం చేశారు. కార్యకర్తలకు సెలవులు కావటంతో సహాయకులు విధులు నిర్వహిస్తున్నారు. కేంద్రాల్లో ఉండాల్సిన స్టాకు రిజిస్టర్‌లు, అటెండెంట్ రిజిస్టర్లు అందుబాటులో లేకపోవటం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్రాల్లో ఉండాల్సిన రిజిస్టర్‌లు, ఇళ్ల వద్ద ఉండటం



బల్లికురవ మండలంలో అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న బత్తుల పద్మావతి

ఎమిటని ప్రశ్నించారు. పాలు, కోడిగుడ్లు, పౌష్టికాహారం సక్రమంగా పంపిణీ చేయటం లేదని చిన్నారుల తల్లి దండ్రులు పద్మావతికి వివరించారు. అంగన్‌వాడీ కేంద్రాలను పర్యవేక్షించాల్సిన సూపర్ వైజర్, సీడీపీవో పట్టించు కోనందువల్లే విధులకు డుమ్మా కొడుతున్నారని విషయాలను బాపట్ల, మహిళ, శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్టు డైరక్టర్‌కు నివేదిస్తామని పద్మావతి తెలిపారు.

హోరాహోరీగా క్రికెట్ పోటీలు



ముక్తేశ్వరం - బల్లికురవ మధ్య జరుగుతున్న క్రికెట్ పోరు

బల్లికురవ: జిల్లా స్థాయి టెన్నిస్‌బాల్ క్రికెట్ పోటీలు మండలంలోని కొణిదెన గ్రామంలోని ఎస్సీ కాలనీ వద్ద 13 రోజులుగా హోరాహోరీగా జరుగుతున్నాయి. ఎండలు సైతం లెక్క చేయకుండా టీంలు నువ్వానేనా అన్నట్లు తలపడుతున్నాయి. బుధవారం ఉదయం నక్కబొక్కలపాడు, కొమ్మినేనివారిపాలెం మధ్య జరిగిన పోరులో నక్కబొక్కలపాడు జట్టు.. మధ్యాహ్నం ముక్తేశ్వరం, బల్లికురవ మధ్య జరిగిన పోరులో ముక్తేశ్వరం జట్టు.. సాయంత్రం కొణిదెన– వల్లాపల్లి మధ్య జరిగిన పోరులో కొణిదెన జట్లు విజేతలుగా నిలిచాయి. మొదటి బహుమతిగా రూ. 20,116 జంద్రాజుపల్లి ముఖేష్, కోటి రెండో బహుమతి రూ. 15,116 ను గెల్లా హరిబాబు, మూడో బహుమతి రూ. 10,116ను బండి హనుమయ్య, మేన్‌ఆఫ్‌ది సిరిస్ రూ.1116ను గెల్లా ఏసుబాబు అందిస్తున్నట్లు చెప్పారు. జూన్ రెండో తేదీన విజేతలకు బహుమతులు అందిస్తానని నిర్వాహక కమిటీ వారు తెలిపారు.